సాక్షి కర్నూలు
గురువారం ; 23 ; ఫిబ్రవరి ; 2023



సాక్షిగణపతికి విశేష పూజలు
శ్రీశైలంటెంపుల్: లోకకల్యాణార్థమై శ్రీశైలంలో బుధవారం సాక్షిగణపతి, జ్వాలావీరభద్రస్వామికి వేదపండితులు విశేషపూజలు నిర్వహించారు. పంచామృతాలతో అభిషేకాలు చేశారు.



సుంకేసులకు ఇన్‌ఫ్లో
గూడూరు: సుంకేసుల రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. బుధవారం ఎగువ నుంచి 520 క్యూసెక్కుల నీరు రాగా కేసీ కాల్వకు 817 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు.



రమణీయం.. పాదుకా పట్టాభిషేకం
శ్రీ రాఘవేంద్ర స్వామి మఠంలో సద్గురు బంగారు పాదుకల పట్టాభిషేకం కనువిందు చేసింది. అశేషభక్తజన వాహిని మధ్య శ్రీమఠంలో రథయాత్ర రమణీయంగా సాగింది. 8లో▸

న్యూస్‌రీల్

ఆర్టీసీకి శివరాత్రి ఆదాయం రూ.2.80 కోట్లు



కర్నూలు(రాజ్‌విహార్): మహాశివరాత్రి సందర్భంగా శైవక్షేత్రాలకు నడిపిన 294 బస్సుల నుంచి రూ.2.80 కోట్ల ఆదాయం వచ్చినట్లు జిల్లా ప్రజా రవాణ శాఖాధికారి టి. వెంకటరామం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీశైలానికి 247 బస్సులు నడపగా రూ.2.57కోట్లు, వెంకటాపురానికి 32 బస్సులు తిప్పగా 20.34లక్షలు, జగన్నాథగట్టుకు మూడు బస్సులు నడపగా రూ.33వేలు, గురజాలకు 12 బస్సులు తిప్పగా రూ.1.94లక్షలు వచ్చినట్లు పేర్కొన్నారు. గతేడాది 282 బస్సులు నడపగా రూ.2.29కోట్లు వచ్చాయని, ఈ ఏడాది రూ.50 లక్షల ఆదాయం అదనంగా వచ్చిందని తెలిపారు.

ఉయ్యాలవాడ పోరాటం అజరామరం



నరసింహారెడ్డి విగ్రహానికి పూలమాల వేస్తున్న కలెక్టర్ కోటేశ్వరరావు

కర్నూలు(అర్బన్): బ్రిటీష్ పాలకులపై ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చేసిన పోరాటం అజరామరం అని జిల్లా కలెక్టర్ పీ కోటేశ్వరరావు అన్నారు. నరసింహారెడ్డి వర్ధతిని పురస్కరించుకొని బుధవారం ఏ క్యాంప్‌లోని ఉయ్యాలవాడ విగ్రహానికి పూలమాలలు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 1857 సిపాయిల తిరుగుబాటుకు పదేళ్ల ముందే బ్రిటీష్ పాలకులను ఎదిరించిన వీరుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అని కొనియాడారు. ఆయన జ్ఞాపకార్థం ఓర్వకల్లు దగ్గర ఉన్న విమానాశ్రయానికి ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పేరు పెట్టారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ, బీసీ కార్పొరేషన్ ఈడీ ఏ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పొదుపు మహిళలకు పెద్ద ఎత్తున రుణాలు



మాట్లాడుతున్న నాబార్డు డీడీఎం పార్థవ

కర్నూలు(అగ్రికల్చర్): పొదుపు మహిళలకు పెద్ద ఎత్తున రుణాలు పంపిణీ చేయాలని బ్యాంకర్లకు నాబార్డు డీడీఎం పార్థవ సూచించారు. బుధవారం కర్నూలులోని ఓ హోటల్‌లో నాబార్డు ఆధ్వర్యంలో బ్యాంకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు స్వయం ఉపాధిలో రాణించే విధంగా బ్యాంకులు సహకరించాలని పేర్కొన్నారు. ఎల్‌డీఎం వెంకటనారాయణ మాట్లాడుతూ పొదుపు మహిళలకు లక్ష్యాలను మించి రుణాలు పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సహకార కేంద్రబ్యాంకు సీఈఓ రామాంజనేయులు, ఏపీజీబీ ఆర్‌ఎం పీవీ రమణ, ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ రాజరత్నం, జిల్లా పరిశ్రమల కేంద్రంఏడీ వెంకటరెడ్డి, జిల్లా ఉద్యాన అధికారి రామాంజనేయులు, జిల్లా మత్స్యశాఖ అధికారి శ్యామల తదితరులు పాల్గొన్నారు.

ఐదు గ్రంథాలయాలకు నూతన భవనాలు



రికార్డులు తనిఖీ చేస్తున్న ప్రకాశ్

పత్తికొండటౌన్: జిల్లాలో ఐదు గ్రంథాలయాలకు నూతన భవనాలు నిర్మించేందుకు టెండర్లు ఆహ్వానించినట్లు జిల్లా గ్రంథాలయసంస్థ కార్యదర్శి ప్రకాశ్ తెలిపారు. బుధవారం స్థానిక శాఖాగ్రంథాలయాన్ని జిల్లా కార్యదర్శి ప్రకాశ్ తనిఖీ చేశారు. కార్యాలయ రికార్డులను పరిశీలించారు.గ్రంథాలయాధికారి రామ్‌కుమార్ పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నన్నూరు, కృష్ణగిరి, దేవనకొండ, కోడుమూరు, ఆస్పరి గ్రంథాలయాలకు నూతన భవన నిర్మాణాల కోసం ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు.

ఎమ్మెల్సీ పోరు రసవత్తరం

ఎమ్మెల్సీ ఎన్నికల పోరు కీలక దశకు చేరింది. ప్రధాన పార్టీల అభ్యర్థులు బుధవారం నామినేషన్లు దాఖలు చేశారు. ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థులు సైతం బరిలోకి దిగుతున్నారు. దీంతో భారీగా నామినేషన్లు దాఖలై పోరు రసవత్తరంగా మారింది. నామినేషన్ల ఘట్టానికి గురువారంతో తెర పడనుంది. –సాక్షిప్రతినిధి, కర్నూలు





ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు సమర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ పట్టభద్రుల అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎంవీ రామచంద్రారెడ్డి

- ప్రధానపార్టీల అభ్యర్థుల నామినేషన్లు దాఖలు
- నేటితో ముగియనున్న నామినేషన్ల ఘట్టం
- ఓటర్లను ప్రసన్నం చేసుకోవడంలో అభ్యర్థులు నిమగ్నం
- మొదటి ప్రాధాన్యత ఓటుపై విస్తృత ప్రచారం
- పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా దూసుకుపోతున్న వెన్నపూస రవీంద్రారెడ్డి
- ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డికి విజయావకాశాలు!
- స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా నేడు నామినేషన్ వేయనున్న బోయ మధుసూదన్

రాయలసీమ పశ్చిమ నియోజకవర్గ పట్టభద్రుల, ఉపాధ్యాయ శాసనమండలి స్థానాలకు వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ మద్దతుతో బరిలోకి దిగుతున్న వెన్నపూస రవీంద్రారెడ్డి, రామచంద్రారెడ్డి బుధవారం అనంతపురంలో నామినేషన్లు దాఖలు చేశారు. వీరితో పాటు టీడీపీ పట్టభద్రుల అభ్యర్థిగా భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, పీడీఎఫ్ తరఫున ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా కత్తి నరసింహారెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోతుల నాగరాజు నామినేషన్ దాఖలు చేశారు. ఐదో రోజు బుధవారం పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు 41 సెట్లు నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో పట్టభద్రుల ఎమ్మెల్సీకి 32 సెట్లు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి 9 సెట్లు దాఖలయ్యాయి. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైన ఈ నెల 16వ తేదీ నుంచి ఇప్పటి వరకు పట్టభద్రులు, ఉపాధ్యాయ స్థానాలకు 76 సెట్లు నామినేషన్లు దాఖలయ్యాయి. గురువారంతో నామినేషన్ల దాఖలు ప్రక్రియ పూర్తికానుంది. ఈ నెల 24వ తేదీన నామి నేషన్ల పరిశీలన (స్క్రూటినీ) నిర్వహిస్తారు. ఈనెల 27 వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం కల్పించారు. మార్చి 13న పోలింగ్ జరగనుంది.

ముమ్మర ప్రచారం

బరిలో ఉన్న అభ్యర్థులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. సార్వత్రిక ఎన్నికలతో పోలిస్తే ఈ ఎన్నికల ప్రచారం, పోలింగ్‌సరళి భిన్నంగా ఉంటుంది. ఓటర్లను గుర్తించి, ఓటు అభ్యర్థించడం కాస్త జటిలమే! ఆరు జిల్లాల్లోని 38 నియోజకవర్గాల పరిధిలో 3.28 లక్షల మంది పట్టభద్రుల ఓటర్లు, 27,216 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారు. వీరందరిని ప్రసన్నం చేసుకోవడం కష్టమైన పని! దీంతో ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధుల మద్దతుతో అభ్యర్థులు ముందడుగు వేస్తున్నారు. 38 నియోజకవర్గాల్లో హిందూపురం, ఉరవకొండ మినహా తక్కిన 36 నియోజకవర్గాల్లో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వీరు ఆ పార్టీ గ్రాడ్యుయేట్ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి గెలుపు కోసం ప్రణాళికతో పనిచేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగాలు పొందిన వారితో పాటు ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులను కలిసి ఓట్లు అభ్యర్థిస్తున్నారు. మొత్తం 36మంది ఎమ్మెల్యేలు, పలువురు ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు వెన్నపూస రవీంద్రారెడ్డి గెలుపు కోసం పనిచేస్తున్నారు. టీడీపీ అభ్యర్థి రాంగోపాల్‌రెడ్డి కోసం శ్రమించే నేతలు లేరు. చాలా నియోజకవర్గాల్లో టీడీపీకి ఇన్‌చార్జ్‌లే లేని పరిస్థితి నెలకొంది. ఇన్‌చార్జ్‌లుగా ఉన్నవారు కూడా పార్టీపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. తమ రాజకీయమే తమకు కష్టంగా ఉందని ఎమ్మెల్సీ పోరుపై దృష్టి సారించడం లేదు. దీంతో రాంగోపాల్‌రెడ్డి కూడా ప్రచారంపై ఆసక్తి చూపడం లేదు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోరులో రామచంద్రారెడ్డి, కత్తి నరసింహారెడ్డి, డాక్టర్ అనిల్ మధ్య ప్రధాన పోరు ఉంది. వీరిలో రామచంద్రారెడ్డికి వైఎస్సార్‌టీయూ, పీఆర్‌టీయూ, ఆంధ్రప్రదేశ్ అన్ ఎయిడెడ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్‌తో పాటు పలు యూనియన్లు మద్దతు ప్రకటించాయి. ఇతనికి ఉపాధ్యాయవర్గాల్లో మంచిపేరు ఉంది. ఇతనికే ఎక్కువ విజయావకాశాలు ఉన్నట్లు ఉపాధ్యాయుల్లో చర్చ నడుస్తోంది.

ప్రాధాన్యత ఓటుపై అవగాహన

మండలి ఎన్నికల్లో ఒకరికి మించి ఎక్కువమంది అభ్యర్థులకు ప్రాధాన్యత క్రమంలో ఓటు వేసే అవకాశం ఓటరుకు ఉంటుంది. గత ఎన్నికల్లో మూడో ప్రాధాన్యత ఓటును కూడా లెక్కించే వరకూ ఫలితం తేలలేదు. దీంతో రెండు, మూడో ప్రాధాన్యత ఓట్లు కీలకం అవుతాయి. దీంతో అంత వరకూ వెళ్లకుండా మొదటి ప్రాధాన్యత ఓట్లు ఎక్కువగా సాధించి మొదటి స్థానంలో నిలిచేందుకు అభ్యర్థులు ప్రయత్నిస్తున్నారు. మొదటి ప్రాధాన్యత ఓటు మాత్రమే వేయాలని రెండో ప్రాధాన్యత ఓటు ఎవ్వరికీ వేయవద్దని అభ్యర్థిస్తున్నారు. అయితే ఈ దఫా ఎన్నికల్లో కూడా మూడో ప్రాధాన్యత ఓటు వరకూ కౌంటింగ్ వెళుతుందని రాజకీయపార్టీలతో పాటు ఉపాధ్యాయ వర్గాల్లో చర్చ నడుస్తోంది.

నేడు బోయ మధు నామినేషన్

స్థానిక సంస్థల కోటా నుంచి వైఎస్సార్‌సీపీ తరఫున బరిలోకి దిగుతున్న బోయ మధుసూదన్ గురువారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. మునిసిపల్, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు ఈ ఎన్నికల్లో ఓటు హక్కు ఉంటుంది. వీరిలో సింహభాగం వైఎస్సార్‌సీపీ అభ్యర్థులే. దీంతో టీడీపీ పోటీలో నిలిచే పరిస్థితి ఉండకపోవచ్చు. ఒకవేళ బరిలో ఉన్నా మధు గెలుపు నల్లేరుపై నడకే!

విందు రాజకీయాలు

ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులు కొందరు విందు రాజకీయాలకు తెరలేపారు. అలాగే కొన్ని ప్రైవేటుస్కూళ్ల యాజమాన్యాలను సంప్రదించి స్కూలులో ఉన్న ఓట్లను బట్టి కరస్పాండెంట్లకు డబ్బులు ఇస్తున్నారు. అభ్యర్థులు ఇచ్చిన డబ్బులు, యజమాన్యాలు ఉపాధ్యాయులకు ఇచ్చే డబ్బుల్లో వ్యత్యాసం ఉంటోంది. దీంతో కొందరు ఉపాధ్యాయులు దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అభ్యర్థులు తమను నేరుగా సంప్రదించకుండా యాజమాన్యాలను కలవడాన్ని తప్పుబడుతున్నారు. ఈ వివాదం కూడా కొన్ని స్కూళ్లతో పాటు ఉపాధ్యాయ వర్గాల్లో నడుస్తోంది. ఉపాధ్యాయుల ఓట్లు తక్కువగా ఉండటంతో వీరిని కలవడం, ప్రసన్నం చేసుకోవడం అభ్యర్థులకు సులువుగానే ఉంది. అలాగే కొన్ని యూనియన్లు అభ్యర్థులతో యూనియన్‌ను బట్టి రూ.15–రూ. 20లక్షలు డిమాండ్ చేస్తున్నారు. ఈ మొత్తాన్ని కూడా అభ్యర్థులు చెల్లిస్తున్నారు.

ఇక ఆరు నెలలకొకసారి 'లా నేస్తం'

- జిల్లాలో 101 మందికి రూ.5.25 కోట్ల జమ

కర్నూలు(సెంట్రల్): యువ న్యాయవాదులకు వైఎస్సార్ లా నేస్తం పారితోషికాన్ని ఇక నుంచి ఆరు నెలలకు ఒకసారి అందజేస్తామని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారు. ఇప్పటి వరకు సంవత్సరానికి ఒకసారి నెలకు రూ.5 వేల ప్రకారం స్టైఫండ్ రూపంలో రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తోంది. కాగా, వరుసగా నాలుగో సంవత్సరం వైఎస్సార్ లా నేస్తం పథకం కింద అర్హులైన యువ న్యాయవాదుల ఖాతాల్లో నగదును సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి బుధవారం బటన్ నొక్కి జమ చేశారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రసంగాన్ని కలెక్టరేట్ నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా యువ న్యాయవాదులు వీక్షించారు. కర్నూలు జిల్లాలో 101 మంది యువ న్యాయవాదుల ఖాతాల్లో రూ.5.25 కోట్లు జమ అయ్యాయి.

వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకుంటున్నాం



మేం పేదరికంలో ఉన్నాం. న్యాయవాద వృత్తిపై ఉన్న ప్యాషన్‌తో కష్టనష్టాలకోర్చి ఎల్ఎల్‌బీ పూర్తి చేశాం. ప్రస్తుతం కర్నూలు కోర్టులో ఓసీనియర్ న్యాయవాది దగ్గర జూనియర్‌గా పనిచేస్తున్నాను. ఈ సమయంలో మాకు నెలకు రూ.5 వేల ప్రకారం స్టైఫండ్ వస్తుండడంతో వృత్తి నైపుణ్యాలను పెంపొందించేందుకు వినియోగిస్తున్నాం.
– రూప, న్యాయవాది, కర్నూలు

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట ఇస్తే తప్పరు. పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు న్యాయవాదులకు నెలకు రూ.5వేలు స్టైఫండ్ ఇస్తున్నారు. గతంలో ఉన్న పాలకులు పట్టించుకోకపోవడంతో అప్పట్లో జూనియర్లుగా జాయిన్ అయినారు ఎన్నో ఆర్థిక ఇబ్బందులు పడేవారని చెబుతుంటారు. మాకు ఆ ఇబ్బందులులేవు. స్టైఫండ్‌తో భవితకు బాటలు వేసుకుంటున్నాం. సీఎం జగన్‌కు రుణపడిఉంటాం.
– గుర్రం రమేష్‌రెడ్డి, నన్నూరు

బీసీల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

- వెనుకబడిన కులాలకు రాజకీయ ప్రాధాన్యం
- విలేకరుల సమావేశంలో వైఎస్సార్‌సీపీ నంద్యాల, కర్నూలు జిల్లాల అధ్యక్షులు కాటసాని, రామయ్య



ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ మధుసూదన్‌ను సన్మానిస్తున్న కాటసాని, రామయ్య తదితరులు

కర్నూలు(రాజ్‌విహార్): బీసీల అభ్యున్నతే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని వైఎస్సార్‌సీపీ నంద్యాల, కర్నూలు జిల్లాల అధ్యక్షులు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, బీవై రామయ్య అన్నారు. బుధవారం స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాన్యులను సైతం చట్ట సభలకు పంపించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిది అన్నారు. అణగారిన వర్గాలకు అన్ని విధాలా గుర్తింపు కల్పిస్తున్నారన్నారు. బీసీ గర్జనలో చెప్పిన విధంగానే నామినేటెడ్ పదవుల్లో 50 శాతం పదవులు బీసీలకు ఇచ్చారన్నారు. శాసన మండలి సీట్లలో అత్యధికంగా బీసీ, ఎస్సీ, ఎస్టీలకు కేటాయించారని పేర్కొన్నారు. బీసీలకు గుర్తింపు కల్పించేందుకు 139 కులాలకు 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి, 672 డైరెక్టర్ పోస్టులను కేటాయించారన్నారు. తాజాగా వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన డాక్టర్ మధుసూదన్‌కు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ టికెట్ ఖరారు చేయడం అభినందనీయమని వెల్లడించారు. టీడీపీ అధినేత చంద్రబాబు బీసీలను ఎన్నికల ముందు వాడుకొని, తరువాత వదిలేశారని విమర్శించారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ మధుసూదన్ మాట్లాడుతూ.. బీసీల సంక్షేమాన్ని కోరుకునే ఏకైక నేత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. అనంతరం మధుసూదన్‌ను పార్టీ నేతలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మహేశ్వరరెడ్డి, పార్టీ రాష్ట్ర నాయకులు సీహెచ్ మద్దయ్య, ధనుంజయ ఆచారి, సత్యం యాదవ్, జిల్లా నాయకులు లక్ష్మీ కాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ సంఘాల అధ్యక్షుల నియామకం

కర్నూలు(రాజ్‌విహార్): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల కర్నూలు జిల్లా అధ్యక్షులను నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం రాత్రి ప్రకటన జారీ చేసింది. జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు పార్టీ పటిష్టతకు కృషి చేయాలని, పార్టీ ఎల్లవేళలా వారికి అండగా నిలుస్తుందని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించినట్లు పార్టీ అనుబంధ విభాగాల రాష్ట్ర కో ఆర్డినేటర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి వెల్లడించారు. మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలిగా బుట్టా రేణుక(కర్నూలు), రైతు విభాగానికి అత్రితనయ గౌడ్(మంత్రాలయం), బీసీ సెల్‌కు జి. సోమశేఖర్(పత్తికొండ), ఎస్సీ సెల్‌కు ఎం. రామాంజనేయులు(మంత్రాలయం), ఎస్టీ సెల్‌కు ఎస్. భాస్కర్ నాయక్(పత్తికొండ), మైనారిటీ సెల్‌కు మలి జిలాన్ బాషా(పాణ్యం), గ్రీవెన్స్ సెల్‌కు బి. మోహన్ కృష్ణ(పత్తికొండ), పబ్లిసిటీ వింగ్‌కు ఎల్. వెంకటేశ్వర్లు (కోడుమూరు), వైఎస్సార్ సేవా దళ్‌కు ఎం. కేదార్ నాథ్(కర్నూలు), కల్చరల్ వింగ్‌కు ఎస్. గోపాల్ రెడ్డి(ఆదోని), డాక్టర్స్ వింగ్‌కు ఓఎం కృష్ణమూర్తి (ఆదోని), పంచాయతీ రాజ్ వింగ్‌కు ఎం. అరుణ్‌కుమార్(ఆలూరు), వీవర్స్ వింగ్‌కు బుట్టా రంగయ్య(ఎమ్మిగనూరు), వాణిజ్య విభాగానికి జి. మహమ్మద్ రఫీక్(ఆదోని), క్రిస్టియన్ మైనారిటీ వింగ్‌కు పి. దీవెన(ఎమ్మిగనూరు), విద్యార్థి విభాగానికి ఆర్. ప్రశాంత్ కుమార్(కోడుమూరు), వైఎస్సార్ టీయూకు కె. భీమేశ్వర్ రెడ్డి(పాణ్యం), వికలాంగుల విభాగానికి జిల్లా అధ్యక్షురాలిగా బి. ప్రసన్న రాణి (పత్తికొండ) ఎన్నికయ్యారు.

స్థానిక ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా విడుదల

- మొత్తం ఓటర్లు 1,178

కర్నూలు(సెంట్రల్): మార్చి 13వ తేదీ జరగనున్న స్థానిక సంస్థల శాసన మండలి ఎన్నికల తుది ఓటర్ల జాబితాను రిటర్నింగ్ అధికారి, జేసీ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి బుధవారం విడుదల చేశారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని మొత్తం ఆరు డివిజన్లలో కలిపి 1,178 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 512 మంది కాగా, స్త్రీలు 666 మంది ఉన్నారు. ఇదిలా ఉంటే నేటితో స్థానిక సంస్థల శాసనమండలి ఎన్నికల నామినేషన్ గడువు ముగియనున్నది. ఈనెల 16 నుంచి ఇప్పటి వరకు ఒక్కరూ కూడా నామినేషన్‌ను దాఖలుచేయలేదు.

డివిజన్ల వారీగా ఓటర్ల వివరాలు...

డివిజన్	పురుషులు	స్త్రీలు	మొత్తం ఓటర
ఆదోని	105	154	259
పత్తికొండ	63	81	144
కర్నూలు	87	104	191
డోన్	75	96	171
నంద్యాల	111	137	248
ఆత్మకూరు	71	94	268
మొత్తం	512	666	1178

పెండింగ్ పనులకు 'లైన్ క్లియర్'

- ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న నేపథ్యంలో ప్రత్యేక కార్యాచరణ
- నిలిచిపోయిన రూ.20.46 కోట్ల పనులు చేపట్టేందుకు ఆదేశాలు
- పరుగులు తీయనున్న ప్రాధాన్యతా భవనాలు, సీసీ రోడ్ల పనులు



ఆలూరులో పూర్తికానున్న రోడ్డు

కర్నూలు(అర్బన్): జిల్లాలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో వివిధ కారణాలతో మధ్యలోనే నిలిచిపోయిన పనులను తిరిగి చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఆదేశాలను జారీ చేసింది. దీంతో ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాలు (గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్స్, వైఎస్సార్ డిజిటల్ లైబ్రరీ, మిల్క్ కూలింగ్ యూనిట్లు) సీసీ రోడ్లు, ఇతరత్రా నిర్మాణాలను చేపట్టేందుకు అవకాశం ఏర్పడుతోంది.. 50 శాతానికి పైగా పనులు జరిగి వివిధ కారణాలతో ఆగిపోయిన వాటిని తిరిగి చేపట్టేందుకు అవసరమైన ప్రతిపాదనలను పంపాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ ఏడాది మార్చి నెలాఖరుతో ఈ ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున రాష్ట్ర వ్యాప్తంగా రూ.1,300 కోట్లు వినియోగించుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో ఈ నిధులను సద్వినియోగం చేసుకునేందుకు వీలుగా పెండింగ్ పనులను పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలోనే ప్రత్యేకంగా రూపొందించిన ఫార్మెట్‌లో నిలిచిపోయిన పనుల వివరాలను పంపాలని సర్కిల్ కార్యాలయం నుంచి క్షేత్ర స్థాయి ఇంజనీర్లకు ఆదేశాలు జారీ అయ్యాయి.

పరుగులు తీయనున్న పనులు

రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల జిల్లాలో జరుగుతున్న ప్రాధాన్యత భవన నిర్మాణాలు, సీసీ రోడ్ల పనులు శరవేగంగా జరిగే అవకాశాలు ఉన్నాయి. చేపట్టిన ఈ పనులకు మార్చి నెలాఖరు నాటికి రెండు విడతలుగా ప్రభుత్వం నిధులను విడుదల చేయనున్నట్లు సమాచారం. పనులను నిర్ణీత సమయంలోగా పూర్తి చేసేందుకు ఇంజనీర్లు క్షేత్ర స్థాయిలో చర్యలు చేపట్టారు.

పనులు పూర్తి అయ్యేందుకు అవకాశం



ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో మెజారిటీ పనులు పూర్తి అయ్యేందుకు అవకాశం ఉంటుంది. 50 శాతం పనులు జరిగి ఆగిపోయిన వాటి వివరాలను రూపొందించిన ఫార్మెట్‌లో వెంటనే పంపించాలని ఇప్పటికే గూగుల్ మీట్‌లో జిల్లాలోని ఈఈ, డీఈఈలను కోరాం. అలాగే 50 శాతాని కంటే తక్కువ పనులు జరిగిన వాటికి కూడా ఎమ్మెల్యేల అనుమతితో ప్రతిపాదనలను అందజేస్తే వాటిని జిల్లా కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి పంపుతాం. ఈ పనులకు మార్చి నెలాఖరు నాటికి నిధులు విడుదలయ్యే అవకాశాలు ఉన్నాయి.
– కే సుబ్రమణ్యం, పీఆర్ ఎస్ఈ

నియోజకవర్గాల వారీగా చేపట్టనున్న పనుల వివరాలు

నియోజకవర్గం	నిలిచిపోయిన పనులు	అంచనా మొత్తం	చేసిన వ్యయం	చెల్లించాల్సిన వ్యయం
ఆలూరు	101	రూ.10,87,66,642	రూ.8,01,31,559	రూ.2,86,35,083
పత్తికొండ	133	రూ.11,53,88,881	రూ.8,48,49,678	రూ.3,05,39,203
ఆదోని	62	రూ.4,42,52,798	రూ.3,40,96,290	రూ.1,01,56,508
మంత్రాలయం	242	రూ.15,90,67,847	రూ.11,61,04,423	రూ.4,29,63,424
ఎమ్మిగనూరు	81	రూ.10,94,41,726	రూ.8,07,80,049	రూ.1,83,44,631
పాణ్యం (ఓర్వకల్లు, కల్లూరు)	66	రూ.9,78,82,461	రూ.6,73,48,240	రూ.3,05,34,221
కర్నూలు, కోడుమూరు	139	రూ.13,77,54,114	రూ.10,46,20,346	రూ.3,31,33,768

25న గొర్రెల పెంపకందారుల సమావేశం

కర్నూలు(అగ్రికల్చర్): గొర్రెల పెంపకందారుల సహకార యూనియన్ జిల్లా సర్వసభ్య సమావేశం ఈ నెల 25న నిర్వహించనున్నట్లుగా జిల్లా గొర్రెల అభివృద్ధి విభాగం ఏడీ డాక్టర్ సుభాన్‌బాషా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్ సమావేశ భవనంలో జరగనున్న సమావేశానికి జిల్లాలోని ప్రాథమిక గొర్రెల పెంపకందారుల సహకార సంఘాల అధ్యక్షులు హాజరు కావాలని కోరారు. రెండవ విడత ఎన్‌సీడీసీ నిధుల విడుదల, ఇతర ప్రాధాన్యతా అంశాలపై చర్చించి, తగిన నిర్ణయాలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు.

భారత ప్రభుత్వం, ఆర్థిక మంత్రిత్వ శాఖ
ఆర్థిక సేవల శాఖ
డెట్స్ రికవరీ ట్రిబ్యునల్-2 హైదరాబాద్ వద్ద
1వ అంతస్తు, త్రివేణి కాంప్లెక్స్, అబిడ్స్, హైదరాబాద్-500001. ఫోన్: 040-24756467

RP No.612 of 2017 తేదీ: 13.02.2023

అమ్మకం ప్రకటన-ఈమ్-ఇ-వేలం

రికవరీ ఆఫ్ డెట్స్ డ్యూ టు బ్యాంక్స్ అండ్ ఫైనాన్షియల్ ఇన్‌స్టిట్యూషన్స్ యాక్ట్, 1993తో చదువబడే ఆదాయపన్ను చట్టం 1961కి రెండవ షెడ్యూలులోని రూల్స్ 38, 52(2) క్రింద అమ్మకం ప్రకటన

(CH) స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ...సర్టిఫికెట్ హోల్డర్
రికవరీ సెల్, స్టాంటన్‌పురం, కర్నూలు, కర్నూలు జిల్లా

వర్సెస్

(CD1) శ్రీమతి నతీమా భాషాన్ భర్త శ్రీ అబ్దుల్ సలీం, వృత్తి: వ్యాపారం, ప్రొప్రైటర్: మెసర్స్ రాయలసీమ మెటల్ కాస్టింగ్స్, ప్లాట్ నం.60, సర్వే నం.233/01, కల్లూరు గ్రామం, ఇండస్ట్రియల్ ఎస్టేట్ (ఎక్స్‌ప్యాన్షన్) ఫేజ్-III, కల్లూరు, కర్నూలు జిల్లా. మరియు ఇక్కడ కూడా: ఇ.నం.5-89, లొంబిదర్గా వెనుక, కర్నూలు సిటీ, కర్నూలు జిల్లా.

...సర్టిఫికెట్ డెటార్స్

రికవరీ ఆఫ్ డెట్స్ డ్యూ టు బ్యాంక్స్ అండ్ ఫైనాన్షియల్ ఇన్‌స్టిట్యూషన్స్ యాక్ట్, 1993లోని సెక్షన్ 19(22) క్రింద గౌరవనీయ ప్రిసైడింగ్ ఆఫీసర్, డెట్స్ రికవరీ ట్రిబ్యునల్-II, హైదరాబాద్ వారిచే RP No.612/2017 (పాత RP No.281/2015) తేది 09.10.2015 గం రికవరీ సర్టిఫికెట్ జారీచేయబడింది. ఆదాయపన్ను చట్టం, 1961కి రెండవ మరియు మూడవ షెడ్యూల్స్ మరియు పైన తెలిపిన రికవరీ సర్టిఫికెట్‌లో నిర్దేశించిన రూ.1,06,68,567.14 (ఒక కోటి ఆరు లక్షల అరవై ఎనిమిది వేల ఐదు వందల అరవై ఏడు రూపాయల పద్నాలుగు పైసలు మాత్రమే)తో పాటు వడ్డీ మరియు వ్యయాలు మొదలైనవాటిని సర్టిఫికెట్ డెటార్స్ నుంచి రాబట్టుకొనుటకు దిగువ సంతకందారు RP No.612 of 2017 లో రికవరీ ప్రొసీడింగ్స్ చేపట్టారు.

మరియు రికవరీ సర్టిఫికెట్ సంతృప్తి మేరకు దిగువ జతచేసిన షెడ్యూల్‌లో పేర్కొన్న తనఖాపెట్టిన/ అటాచ్‌చేసిన ఆస్తి అమ్మకానికి దిగువ సంతకందారు ఆదేశించారు.

మరియు 29.03.2023న (అమ్మకానికి నిర్ణయించిన తేది) మొత్తం రూ.1,06,68,567.14 (ఒక కోటి ఆరు లక్షల అరవై ఎనిమిది వేల ఐదు వందల అరవై ఏడు రూపాయల పద్నాలుగు పైసలు మాత్రమే)ప్లస్ రికవరీ సర్టిఫికెట్ తేదీ నుండి ఆదేశించిన విధంగా వడ్డీ ప్లస్ వ్యయం బకాయిగా ఉంటాయి.

వాయిదాకు సంబంధించి ఏదేని ఆదేశం లేనట్లయితే, సదరు ఆస్తి 29.03.2023న ఇ-వేలం ద్వారా విక్రయించబడుతుందని మరియు సర్వీస్ ప్రొవైడర్ మెసర్స్ సి1 ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, హైదరాబాద్, సంప్రదించవలసిన వ్యక్తి: శ్రీ గాంధీ మరియు సంప్రదించవలసిన నం. 9700333933, మెయిల్ ఐడి: Telangana@c1india.com & support@bankeauctions.comచే వెబ్‌సైట్ https://www.bankeauction.com ద్వారా "ఆన్‌లైన్ ఎలక్ట్రానిక్ బిడ్డింగ్" ద్వారా బిడ్డింగ్ నిర్వహించబడుతుందని ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది.

మరిన్ని వివరాల కోసం సంప్రదించండి: శ్రీ పి.ప్రభాకర్ (మేనేజర్), స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, స్ట్రెస్డ్ అసెట్స్ రికవరీ బ్రాంచ్-II, హైదరాబాద్, సంప్రదించవలసిన నం. 7386623173, మెయిల్ ఐడి: sbi.20945@sbi.co.in షెడ్యూలు ఆస్తి విచారణ, తనిఖీ కోసం, వేలం అమ్మకం క్రింద ఉన్న టైటిల్ డీడ్స్ కాపీలు మరియు ఐటీసని ఎన్‌కంబ్రెన్స్ సర్టిఫికెట్‌ను తగినంత జాగ్రత్తగా చదువుకోవలెను మరియు ఆస్తి టైటిల్ గురించి తమంతటతాము సంతృప్తి చెందవలెను.

నియమ నిబంధనలు

1. షెడ్యూల్‌లో తెలిపిన విధంగా స్థిరాస్తి అమ్మకం ఉంటుంది.
2. ఆస్తి రూ.57,60,000/- రిజర్వు ధర కంటే తక్కువగా విక్రయించబడదు.
3. ఆస్తి ప్రకారం 29.03.2023న మ.12.30 గం. నుండి మ.1.00 గం.ల వరకు వేలానికి ఉంచబడును.
4. ఈ అమ్మకానికి సంబంధించి ఏదేని విధి నిర్వహిస్తున్న ఏ అధికారి లేదా ఏ ఇతర వ్యక్తి అమ్మబడే ఆస్తికి సంబంధించి ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా బిడ్డు వేయకూడదు, ఏదేని ప్రయోజనం పొందకూడదు లేదా పొందేందుకు ప్రయత్నించరాదు. ఆదాయపన్ను చట్టం 1961కి రెండవ షెడ్యూల్‌లో నిర్దిష్టపరిచిన నిబంధనలకు మరియు ఆదాయ పన్ను సర్టిఫికెట్ ప్రొసీడింగ్స్ రూల్స్ 1962, అందులో చేయబడిన రూల్స్‌కు లోబడి అమ్మకం ఉంటుంది.
5. బిడ్డర్లు ఇ-వేలం అమ్మకం ప్రొసీడింగ్స్‌లో పాల్గొనేందుకు తమ బిడ్డు దాఖలు చేసేముందు వేలం అమ్మకం యొక్క సవివరమైన నియమ నిబంధనలు, విధానం, దరఖాస్తు ఫారం మొదలైనవాటి కోసం వెబ్‌సైట్: https://www.bankeauctions.com చూడవలసిందిగా సూచించబడుచున్నారు.
6. జతపరిచిన షెడ్యూల్‌లో పేర్కొన్న వివరాలు దిగువ సంతకందారుకు తెలిసిన సమాచారం మేరకు తెలియజేయబడినవి అయితే ఈ ప్రకటనలో ఏదేని పొరపాటు, తప్పుడు స్టేట్‌మెంట్ లేదా వదిలివేయుటకు దిగువ సంతకందారు జవాబుదారీ కాదు.
7. అత్యధిక బిడ్డరు ఆస్తి కొనుగోలుదారుగా ప్రకటించబడతారు అయితే అతను ఎల్లప్పుడూ బిడ్డు వేయడానికి న్యాయపరంగా అర్హత కలిగి ఉండాలి మరియు అయితే తరువాత అతనిచే బిడ్డు చేయబడే మొత్తం రిజర్వు ధర కంటే తక్కువగా ఉండరాదు. ఆఫరు చేసిన ధర తగినంతగా లేదని స్పష్టంగా కనిపించినప్పుడు అవిధంగా చేసేందుకు ఆమోదయోగ్యంకాని సందర్భంలో అత్యధిక బిడ్ అంగీకారాన్ని తిరస్కరించడం దిగువ సంతకందారు విచక్షణ మేరకు ఉంటుంది.
8. బిడ్డరు రిజర్వు ధరలో 10% మేరకు బయానాను Account No.52013038332 మరియు IFSC Code: SBIN0020740లో జమకు RTGS/NEFT/ఫండ్స్ ట్రాన్స్‌ఫర్ ద్వారా గాని లేదా "Registrar, DRT-2, Hyderabad" పేరున డిమాండ్ డ్రాఫ్ట్/ పేఆర్డర్ ద్వారా గాని 27.03.2023లోగా డిపాజిట్ చేయాలి.
9. సఫలీకృత బిడ్డరు పాట కొట్టివేయబడిన వెంటనే 10% బయానా మొత్తాన్ని సర్దుబాటు చేసిన తర్వాత కొనుగోలు ప్రతిఫలంలో 25% మరునటి పనిరోజున అంటే మ.3.00 గం.లోగా పైన పేరా 8లో పేర్కొన్న వివరాల ప్రకారం సదరు ఖాతాలో చెల్లించాలి. ఒకవేళ మరునటి పనిరోజు సెలవుదినం లేదా ఆదివారం అయినట్లయితే, ఆ మరునటి పనిరోజున చెల్లించాలి. కొనుగోలు ప్రతిఫలంలో మిగతా 75% వేలం తేదీ నుంచి 15 రోజులలోగా చెల్లించాలి.
10. పైన తెలిపినదానికి అదనంగా, కొనుగోలుదారు పౌండేజ్ ఫీజు రూ.1000/- వరకు 2% వంతున "Registrar, DRT-2, Hyderabad" వద్ద మరియు సదరు మొత్తం రూ.1000/- కంటే అధికంగా ఉంటే 1% వంతున "Registrar, DRT-2, Hyderabad" పేరున డి.డి. ద్వారా డిపాజిట్ కూడా చేయాలి.
11. నిర్ణీత వ్యవధిలోగా చెల్లింపు చేయడంలో విఫలమైతే, అమ్మకం ఖర్చులను భరించిన తర్వాత డిపాజిట్‌ను దిగువ సంతకందారు తగిన విధంగా ఉందని భావిస్తే, ప్రభుత్వానికి స్వాధీనం చేస్తారు మరియు డిఫాల్టింగ్ కొనుగోలుదారు ఆస్తికి లేదా ఆ తర్వాత విక్రయించబడే దానికోసం మొత్తంలో ఏదేని భాగానికి అన్ని క్లెయిమ్‌లను కోల్పోతారు. అమ్మకం యొక్క తాజా ప్రకటన జారీ చేసిన తరువాత ఆస్తి తిరిగి విక్రయించబడుతుంది.
12. ఆస్తి కోసం బిడ్డింగ్ చేసే కొనుగోలుదారు అమలులో ఉన్న వర్తించే చట్టాలకు కట్టుబడి ఉన్నట్లుగా రూఢీ చేసుకోవాలి. ఆస్తి "ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలాగే" మరియు "అక్కడ ఏమున్నదో అదే" స్థితిలో విక్రయించబడును. బిడ్డర్లు ఆస్తికి సంబంధించి యాజమాన్యత, తాకట్టు రుణభారాలు, ఛార్జీలు లేదా పన్నులు మొదలైనటువంటి చట్టబద్ధమైన బకాయిల గురించి తమ స్వంత విచారణలు జరుపుకోవలెను. బిడ్డర్లు బిడ్డు దాఖలు చేసేముందు తాము తగినంత జాగ్రత్తగా పరిశీలించి దాఖలు చేశారని భావించబడుతుంది.
13. ఆస్తి "ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలాగే మరియు అక్కడ ఏమున్నదో అదే ప్రాతిపదికన" విక్రయించబడుచున్నది.
14. ఏ కారణం తెలుపకుండానే బిడ్డు సహేతుకంగా లేదని కనుగొనబడితే ఏదేని లేదా అన్ని బిడ్డను అంగీకరించుటకు లేదా తిరస్కరించుటకు లేదా ఎప్పుడైనా వేలం వాయిదా వేయు హక్కు దిగువ సంతకందారుకు కలదు.

అమ్మకానికి ఉంచిన స్థిరాస్తుల వివరణ

ల్యాండ్ డాక్యుమెంట్ నం.5202/2008 తేది: 26.06.2008 అమ్మకం కొరకు రిజిస్టర్డ్ అగ్రిమెంట్‌తో చదువబడే సేల్ డీడ్ నం.: 8488/2010 తేది: 23.10.2010

కర్నూలు జిల్లా, APIIC - IALA - కర్నూలు మున్సిపల్ లిమిట్స్ పరిధిలో కల్లూరు గ్రామం మరియు మండలం వద్ద గల సర్వే నం.233/1a (భాగం)లోని 539.19 చ.మీటర్లు లేదా 644.35 చ.గజాల విస్తీర్ణం గల ప్లాట్ నం.60 కలిగిన భూమి యావత్తు. సరిహద్దులు: ఉత్తరం: ప్లాట్ నం.59, దక్షిణం: ప్రైవేట్ భూములు, తూర్పు: ప్లాట్ నం.54, పశ్చిమం: 40-00 అ. వెడల్పు రోడ్డు.

వేలం వివరాలు

వేలం తేది	బిడ్ల దాఖలుకు చివరి తేది	వేలం సమయం	రిజర్వు ధర	10% బయానా మొత్తం	బిడ్ పెంపుదల మొత్తం
29.03.2023	27.03.2023	మ.12.30 గం. నుండి మ.1.00 గం.	రూ. 57,60,000/-	రూ. 5,75,000/-	రూ. 50,000/-

నాచే స్వయంగా మరియు ఈ ట్రిబ్యునల్ యొక్క సీల్‌తో 13 ఫిబ్రవరి, 2023న ఇవ్వబడింది.

(ప్రశాంత్ వంద్రానియ)
రికవరీ ఆఫీసర్
డెట్స్ రికవరీ ట్రిబ్యునల్-2, హైదరాబాద్-500001

రమణీయం.. పాదుకా పట్టాభిషేకం

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్ర స్వామి మఠంలో సద్గురు బంగారు పాదుకల పట్టాభిషేకం కనువిందు చేసింది. శ్రీరాఘవేంద్రస్వామి వైభవోత్సవాల్లో భాగంగా బుధవారం మూల బృందావనానికి విశేష పంచామృతాభిషేకం చేశారు. తులసీమాల సమర్పణ, పట్టువస్త్ర అలంకరణ గావించి మంగళహారతులు పట్టారు. శ్రీరాఘవేంద్రులు సన్యాసం పుచ్చుకున్న రోజును పురస్కరించుకుని ఊంజల మంటపంలో స్వామి బంగారు పాదుకలను సింహాసనంపై కొలువుంచారు. శాస్త్రోక్తంగా పాదుకలకు తైలం, ముత్యాలు, వెండి, స్వర్ణ, నవరత్నాలు, సుమాలతో అభిషేకాలు చేశారు. బృందావన ప్రతిమ, పాదుకలు, శ్రీమన్న్యాయ సుధా పరిమళగ్రంథ తాళ పత్రాలకు స్వర్ణ రథంపై కొలువుంచి ఉత్సవం చేపట్టారు. అశేషభక్తజన వాహిని మధ్య శ్రీమఠం మాడవీధుల్లో రథయాత్ర రమణీయంగా సాగింది.



శ్రీమఠంలో సువర్ణ రథోత్సవ దృశ్యం



శ్రీరాఘవేంద్రుల బంగారు పాదుకలకు రత్నాభిషేకం చేస్తున్న పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు

వేడుకల్లో సుప్రీంకోర్టు అటార్నీ జనరల్

గురు భక్తి ఉత్సవాల్లో భాగంగా సుప్రీంకోర్టు అటార్నీ జనరల్ వెంకటరమణి హాజరయ్యారు. మంగళవారం రాత్రి ఆయన మంత్రాలయం చేరుకోగా బుధవారం రాత్రి వరకు వేడుకల్లో పాలుపంచుకున్నారు. గురు పాదుకల అభిషేకం కార్యక్రమంలో కాసేపు ముచ్చటించారు. రాత్రి యోగీంద్ర మంటపంలో కళాకారుల నృత్య ప్రదర్శనలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

అనుగ్రహ ప్రశస్తి అవార్డుల ప్రదానం

గురుభక్తి వైభవోత్సవాల్లో భాగంగా పలువురు ప్రముఖులకు శ్రీమఠం అధ్వర్యంలో రాఘవేంద్రుల అనుగ్రహ ప్రశస్తి అవార్డులు ప్రదానం చేశారు. యోగీంద్ర మంటపం వేదికపై పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు చేతుల మీదుగా అవార్డులు అందజేశారు. సుప్రీంకోర్టు అటార్నీ జనరల్ వెంకటరమణి, తిరుపతి యూనివర్సిటీ ఉపకులపతి కృష్ణమూర్తి, న్యూఢిల్లీ ఉప కులపతి శ్రీనివాస వార్కేడి, నేషనల్ సంస్కృత యూనివర్సిటీ తిరుపతి ఉప కులపతి నారాయణ్ ప్రాదేష్ ఆచార్, తిరుపతి సంస్కృత యూనివర్సిటీ విజిలెన్స్ ఆఫీసర్ గణపతి భట్, గౌహతి పురావస్తు విద్య యూనివర్సిటీ ఉపకులపతి ప్రహ్లాదజోషి, గురురాఘవేంద్రస్వామి ఆరాధన పాదయాత్ర సమితి నిర్వాహకులు రాఘవేంద్ర దేశాయ్, బెంగళూరు ప్రముఖ డాక్టర్ పుతురాయ అవార్డులు అందుకున్నారు. పీఠాధిపతి రాఘవేంద్రుల జ్ఞాపిక, ప్రశంసా పత్రం, శేషవస్త్రం, ఫల పూల మంత్రాక్షింతలతో ఆశీర్వదించారు.



అవార్డు అందుకుంటున్న సుప్రీంకోర్టు అటార్నీ జనరల్ వెంకటరమణి

జొన్న దిగుబడికి నిప్పు

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ. గోవిందిన్నె గ్రామానికి చెందిన జాకీర్ బాషా, నాగేంద్రకు చెందిన జొన్న దిగుబడికి గుర్తుతెలియని వ్యక్తులు బుధవారం రాత్రి నిప్పుపెట్టారు. దీంతో రూ. 6లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోయారు. 8 ఎకరాల పంటను కోసం కంకులను పొలంలోనే కుప్పగా పోశారు. గుర్తుతెలియని దుండగులు ఓర్వలేక ఇలా చేశారని రైతులు వాపోయారు. మంటలు చెలరేగడంతో గమనించిన వారు వెళ్లి చూసేసరికి కంకులు కాలుతుండటంతో గ్రామంలోని ట్యాంకర్‌ను తీసుకవెళ్లి మంటలను ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.



కాలిబూడిదైన కంకులు

మహిళల జీవనోపాధులను అభివృద్ధి చేయండి

- సెర్ప్ అడిషనల్ డైరెక్టర్ మహిత

కర్నూలు(అగ్రికల్చర్): స్వయం సహాయక సంఘాల్లోని మహిళల జీవనోపాధులను మరింత అభివృద్ధి చేయాలని సెర్ప్ అడిషనల్ డైరెక్టర్ మహిత జిల్లా డీఆర్‌డీఏ-వైకేపీ అధికారులను ఆదేశించారు. బుధవారం విజయవాడ నుంచి కర్నూలు జిల్లా అధికారులు, ఏరియా కో-ఆర్డినేటర్లు, ఏపీఎంలు, సీసీలతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా కార్యక్రమాల అమలు, వీఓఏ యాప్‌లో నమోదు చేయడం తదితర వాటిపై ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ డైరెక్టర్ మాట్లాడుతూ చేయూత, ఆసరా సహకారంతో కిరాణం దుకాణాలు, గొర్రెలు, పొట్టేళ్ల పెంపకం, దుస్తుల దుకాణాలు, కూరగాయల వ్యాపారం, పాడి పశువుల పెంపకం ద్వారా ఉపాధిని మెరుగుపరుచుకున్నారని, ఈ ప్రగతిని వీఓఏ యాప్‌లో పొందుపరచాలని సూచించారు. మహిళల ఆదాయ, వ్యయాలు సమగ్రంగా 2020-21 నుంచి నమోదు చేయాలని సూచించారు. జిల్లా నుంచి వివిధ కేటగిరి ఉద్యోగులు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. జూమ్ కాన్ఫరెన్స్‌లో అడిషనల్ పీడీ శ్రీధర్‌రావు, డెయిరీ ఏపీఎం అనిల్ పాల్గొన్నారు.



జూమ్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న డీఆర్‌డీఏ-వైకేపీ అడిషనల్ పీడీ శ్రీధర్‌రావు

అదనపు కట్నం కోసం వేధింపులు

ఆళ్లగడ్డ:పట్టణ సమీపంలోని పి.చింతకుంట గ్రామానికి చెందిన ఓ మహిళను అదనపు కట్నం కోసం వేధిస్తున్న నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తిమ్మయ్య బుధవారం తెలిపారు. అదనపు కట్నం తీసుకరావాలని రోజూ శారీరకంగా మానసికంగా వేధిస్తుండటంతో బాధితురాలు నాగకవిత ఫిర్యాదు మేరకు భర్త వెంకటసుబ్బారెడ్డితో పాటు మరో ముగ్గిరిపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. అలాగే.. పట్టణానికి చెందిన షేక్ రజియాను సంజామల మండలం కానాల గ్రామానికి చెందిన రహంతుల్లా అనే వ్యక్తికి ఐదేళ్ల క్రితం ఇచ్చి వివాహం చేశారు. ప్రస్తుతం వ్యసనాలకు బానిసైన రహంతుల్లా.. కుటుంబ సభ్యులు ఆమెను మానసికంగా శారీకంగా వేధిస్తున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు భర్తతో పాటు మరో ఐదుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ముఖ ఆధారిత హాజరుకు చర్యలు తీసుకోండి

- సీఎం సెక్రటరీ ముత్యాలరాజు

కర్నూలు(సెంట్రల్): ఉద్యోగుల ముఖ ఆధారిత హాజరుకు చర్యలు తీసుకోవాలని సీఎం సెక్రటరీ ముత్యాలరాజు అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన విజయవాడ నుంచి కలెక్టర్లు, ఇతర జిల్లా ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మినహాయింపు పొందిన శాఖలు కాకుండా మిగిలిన శాఖల్లో ముఖ హాజరు విధానాన్ని 100 శాతం అమలు చేయాలన్నారు. కొన్ని చోట్ల మొబైల్ లింక్ సమస్యలు ఉన్నాయని తమదృష్టికి తీసుకొచ్చారని, అటువంటి సమస్యలకు సంబంధించి సీఎఫ్ఎంఎస్‌లో డీడీ లాగిన్‌లో డీడీఓ, సంబంధిత సిబ్బంది మొబైల్ నంబర్ అప్‌లోడ్ చేయాలన్నారు. ఆన్ డ్యూటీలో ఉన్న సిబ్బందికి ఫేస్ అటెండెన్స్ అప్లికేషన్‌లో సంబంధిత డీడీఓలు లొకేషన్ అసైన్ చేసేలా చూడాలన్నారు. క్లాక్ ఇన్ క్లాక్ ఔట్‌కు సంబంధించిన నివేదికలు కూడా సరిగా లేవని, అందరూ సమయానికి ముఖ హాజరు వేసేలా చూడాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పి.కోటేశ్వరరావు, డీఆర్వో నాగేశ్వరరావు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతున్న కలెక్టర్ పి.కోటేశ్వరరావు

ఆముదం దిగుబడులు దగ్ధం

ఆలూరు రూరల్: ప్రమాదవశాత్తు నిప్పంటుకుని రూ.6 లక్షలు విలువ చేసే ఆముదం దిగుబడులు దగ్ధమయ్యాయి. స్థానిక రైతుల తెలిపిన వివరాలు.. గోనేహాల్ గ్రామానికి చెందిన రైతు రాజశేఖర్ తనకు ఉన్న 10 ఎకరాల్లో రూ.3 లక్షలు ఖర్చు పెట్టి ఆముదం పంట సాగు చేశాడు. పంట దిగుబడికి రాగా మూడు రోజుల క్రితం కోత కోసి ఆముదం రాశిని కళ్లంలో ఉంచాడు. బుధవారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు నిప్పంటుకుని ఆముదం దిగుబడి దగ్ధమైంది. ఆలూరు ఫైర్ అధికారులు సంఘటనా స్థలానికి వెళ్లి మంటలు ఆర్పివేశారు. ప్రమాదంపై ఆలూరు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధిత రైతు తెలిపాడు. అగ్ని ప్రమాదం ఎలా జరిగింది, ఎవరైనా నిప్పంటించారా? అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు.



దగ్ధమవుతున్న ఆముదం దిగుబడులు

రోడ్డు ప్రమాదంలో మహిళా కూలీ మృతి

- మరో ఏడుగురికి స్వల్ప గాయాలు

బనగానపల్లె రూరల్: మండలంలోని నందివర్గం పోలీసు స్టేషన్ పరిధిలోని పండ్లాపురం గ్రామ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళా కూలి మృతిచెందగా మరో ఏడుగురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఎస్‌ఐ రామాంజనేయరెడ్డి, బాధితులు తెలిపిన వివరాలు.. కైప గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు కోకిల మేరమ్మ(60), శిరోమణెమ్మ, కె.రాజెమ్మ, ఎం శాంతమ్మ, కె.రాజమ్మ, కె.రమణమ్మ, కె.శిరోమణెమ్మ తదితరులు ఉదయం జొన్న పంట కోత పనుల నిమిత్తం తిమ్మాపురం గ్రామానికి వెంకటయ్య ఆటోలో బయలుదేరారు. మార్గమధ్యలో పండ్లాపురం గ్రామ సమీపంలోకి చేరుకోగానే ఎదురుగా వస్తున్న కారు వీరి ఆటోను ఢీకొంది. ప్రమాదంలో మేరమ్మకు తీవ్ర గాయాలు కాగా ఆటో డ్రైవర్‌తో పాటు మరో ఆరుగురికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి తీవ్రగాయాలైన మేరమ్మను నంద్యాల శాంతిరామ్ వైద్యశాలకు, స్వల్ప గాయాలైన వారిని నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కాగా మేరమ్మ కోలుకోలేక మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతురాలికి భర్త ఏసేబు, నలుగురు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామాంజనేయరెడ్డి తెలిపారు.

నేడు మార్కెట్ యార్డులు బంద్

కర్నూలు(అగ్రికల్చర్):టీడీఎస్ నుంచి కమీషన్ ఏజెంట్లను మినహాయించాలని డిమాండ్ చేస్తూ గురువారం జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ మార్కెట్ యార్డులలో బంద్ పాటించనున్నట్లు కమీషన్ ఏజెంట్ల సంఘం నేత కట్టా శేఖర్ తెలిపారు.బంద్ నోటీసును బుధవారం మార్కెట్ కమిటీ అధికారులకు ఇచ్చారు. ఈ సందర్భంగా కట్టా శేఖర్ మాట్లాడుతూ వ్యవసాయ ఉత్పత్తుల క్రయవిక్రయాలపై సర్వీస్ చార్జ్ కింద 2 శాతం కమీషన్ తీసుకుంటున్నామన్నారు. ఆదాయపు పన్ను శాఖ ఆదేశాల మేరకు రూ.50 లక్షల టర్నోవర్ దాటితే టీడీఎస్ 0.01 శాతం మినహాయించుకుని వ్యాపారులు కమీషన్ ఏజెంట్లకు టీడీఎస్ సర్టిఫికెట్లు ఇస్తున్నారన్నారు. సేవాభావంతో పనిచేస్తున్న తమపై టీడీఎస్ విధించడం తగదన్నారు.

సుంకులమ్మ ఆదాయం రూ.25 లక్షలు



హుండీల కానుకలను లెక్కిస్తున్న సేవకులు

గూడూరు రూరల్: మండల పరిధిలోని కె.నాగలాపురంలోని గ్రామ దేవత శ్రీ సుంకులాపరమేశ్వరీదేవి దేవాలయం హుండీల ఆదాయంను బుధవారం లెక్కించారు. హుండీలలో భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించగా రూ. 25,14,891 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ దినేష్ తెలిపారు. సమయాభావం కారణంగా దేవాలయంలోని అన్ని హుండీల లెక్కింపు జరుపలేదని, గురువారం కూడా కానుకలను లెక్కించనున్నట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌ఐ సోమ్లానాయక్, పోలీసు సిబ్బంది, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

25 లోపు పంట నమోదు చేసుకోవాలి

నంద్యాల(అర్బన్): రబీ కింద రైతులు సాగు చేసిన ప్రతి పంటను ఈనెల 25వ తేదీలోపు నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు కోరారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో రబీ కింద 1.86 లక్షల హెక్టార్ల సాధారణ సాగు విస్తీర్ణం కాగా ఇప్పటి వరకు 1.61 లక్షల ఎకరాల్లో శనగ, మినుము, మొక్కజొన్న, జొన్న, వరి తదితర పంటలు సాగయ్యాయని తెలిపారు. ఈ పంటలకు సంబంధించి రైతుల వివరాలను స్థానిక వీఏఏ, వీహెచ్ఏ, ఎంపీఈఓల ద్వారా నమోదు చేసుకున్నారన్నారు. అలాగు ఈ- పంట నమోదు చేసుకున్న రైతులు విధిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని చెప్పారు.

రైలు కింద పడి.. ప్రాణాలతో బయటపడి!

గుత్తి: జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకునేందుకు రైలు కిందపడిన ఓ యువకుడు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. పోలీసులు తెలిపిన మేరకు... కర్నూలు జిల్లా తుగ్గలి మండలం రాంపురం గ్రామానికి చెందిన రాంబాబు.. మంగళవారం అర్ధరాత్రి తర్వాత గుత్తి జీఆర్పీ పరిధిలోని బసినేపల్లి రైల్వే గేట్ సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. అయితే రెండు పట్టాల మధ్యలో పడడంతో స్వల్ప గాయాలయ్యాయి. లోకో పైలెట్ నుంచి సమాచారం అందుకున్న గుత్తి రైల్వే పోలీసు ఎస్‌ఐ నాగప్ప, సిబ్బంది అక్కడకు చేరుకుని రాంబాబును స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వైద్యుల సూచన మేరకు అనంతపురం సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. రాంబాబు ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియరాలేదు. కాగా, రెండు రోజుల క్రితం కూడా రైలు కిందపడి ఆత్మహత్య చేసుకునేందుకు రాంబాబు ప్రయత్నించగా.. డ్యూటీలో ఉన్న రైల్వే పోలీసులు గమనించి అడ్డుకున్నారు. ఘటనపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాంబాబు

నేడు విపత్తు నివారణ చర్యలపై మాక్ డ్రిల్

కర్నూలు(సెంట్రల్): జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ అథారిటీల అధ్వర్యంలో లక్ష్మీపురంలో భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ ఎల్‌పీజీ ఫిల్లింగ్ ప్లాంట్‌లో గురువారం రసాయన విపత్తు ఆఫ్ సైట మాక్ డ్రిల్ నిర్వహించనున్నట్లు ఫ్యాక్టరీస్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ నారాయణరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అనుకోకుండా ప్రమాదాలు సంభవిస్తే ఎలా ఎదుర్కోవాలో మాక్ డ్రిల్‌లో చూపుతారన్నారు. ఫైర్,మెడికల్, ఫ్యాక్టరీలు, కాలుష్య నియంత్రణ మండలి, పోలీసు, రెవెన్యూ, రాష్ట్ర విపత్తుల రెస్పాన్స్ ఫోర్సు తదితర విభాగాలు హాజరు కావాలని ఆయన కోరారు.

కర్నూలు మార్కెట్ యార్డు ధరలు (క్వింటాల్‌కు రూ.లలో)

పంట	కనిష్టం(రూ)	గరిష్టం (రూ)
వేరుశనగ	4,609	8,040
పొద్దుతిరుగుడు	5,298	5,558
ఆముదం	5,490	6,370
ఉల్లి	500	979
ఎండు మిర్చి	8,199	34,786
శనగలు	2,100	4,619
కందులు	2,500	7,790
మొక్కజొన్న	1,827	2,000
మినుములు	6,800	7,190
వాము	5,089	19,669